ఓం నమోభగవతే శ్రీరమణాయ, శ్రీభారతీ దేవ్యైనమః

ఉమా సహస్రము

(పదియవ శతకమున – ప్రథమస్తబకము)

సప్తత్రింశ స్తబకము.

అవ:- ముప్పది యేడవదగు, నీ స్తబకమున, తత్త్వదర్శియగు నీ యాచార్యుఁడు – అతి సూక్ష్మములును, గభీరములును, నగు ఆశయములు గల కారికలచేత – తత్త్వ సిద్ధాంతమును సంక్షేపముగాఁ బ్రతిపాదించున్నాఁడు. (జ్ఞాన దృష్టిగల భక్తులు – దీనిని నిత్యము పఠింపఁదగును.) ఈ స్తబక ప్రారంభమునఁగూడ దేవీ మందహాసమును సంకీర్తించుచు, దాని స్వరూపము – సాక్షాత్తుగా, 'పరతత్త్వమే' అని ప్రస్తుతించుచున్నాఁడు.

మూ॥ ఉద్దీపయతు నశ్శక్తి మాదిశక్తేర్దరస్మితమ్।
తత్త్వంయస్య మహత్సూక్ష్మమానన్దోవేతి సంశయః॥ 1

ఏ మందహసితము యొక్క తత్త్వము (స్వరూపము) సూక్ష్మమగు (అలౌకికమును, అంతర్దృష్టి గోచరమును, అగు) జ్యోతియా, లేక ఆనందమా? అను సంశయమును గలిగించుచున్నదో, ఆయాదిశక్తి యొక్క దరస్మితము – మాయందతర్గతమును, (హృదయమునందున్నదియు) అనభివ్యక్తమును, (బయటికి తెలియునిదియు) నిద్రితమును, అగు శక్తిని – ఉద్దీపింపఁజేయుఁగాత!

ప్రభ:- ఇచ్ఛా–జ్ఞాన, క్రియారూపములును, సృష్టి– స్థితి–లయ, తిరోధానానుగ్రహ, కారిణులును, అగు సర్వశక్తులకును మూలమగు ఆదిశక్తి యొక్క

వదనమునందు వికసించిన మందస్మితము యొక్క స్వరూపము – సూక్ష్మమును, అలౌకికమును, అంతర్దృష్టిగోచరమును, అగుచున్నది. చీకటిని తొలఁగించుట వలన, నది జ్యోతిస్స్వరూపవమా? దుఃఖములను తొలగించుట వలన, నది – యానందస్వరూపమా? అను సంశయమును గలుగఁజేయుచున్నది. పరమార్థమున, దాని స్వరూపము – జ్యోతియు, ఆనందమును, గూడ –అగుచున్నది. మున్ముందీయంశము స్పష్టము కాఁగలదు. 'అట్టి మందస్మితము – అస్మత్సు త్తయందంతర్గతమై, నిద్రించుచున్న శక్తిని విజృంభింపఁజేయుగావు తమని తాత్పర్యము.

అవ:- మొట్టమొదట, పరతత్త్వమును ప్రతిపాదించుచున్నాఁడు.

మూ॥ పూర్ణం ప్రజ్ఞాతృ, సద్బ్రహ్మ, తస్యజ్ఞానం మహేశ్వరీ।
మహిమా తేజ ఆహోస్వి, చ్ఛక్తిర్వా ప్రాణ ఏవవా॥ 2

పూర్ణమును, ప్రజ్ఞాతయు, నగు సత్తు – బ్రహ్మము. ఆ బ్రహ్మము యొక్క జ్ఞానము మహేశ్వరి. మహిమ, తేజము, శక్తి, ప్రాణము అను నామాంతరముల చేత, ఆమెయే – చెప్పఁబడుచున్నది.

ప్రభ:- అసమాభ్యధికమును, ఏకమును, అగుటచేత – పూర్ణత్వాపచ్ఛిన్నమును (పూర్ణతతోఁ గూడినదియు) విషయి చైతన్యాభివ్యంజకమగు (ప్రజ్ఞాన ధర్మము గలదగుట చేత ప్రజ్ఞాతయు, ప్రజ్ఞానధర్మియు) సత్తాప్రత్యయ గోచరమగుట చేత – సత్తును, అగు వస్తువు – బ్రహ్మమని చెప్పఁబడినది. '' ఏక స్వరూపుఁడగు నెవనికి (ఏ బ్రహ్మమునకు) **1.** పూర్ణత్వము, **2.** ప్రజ్ఞానము, **3.** సత్త, అనునవి స్వరూపధర్మము లగుచుండునో, వాని యొక్క జ్ఞానము – మహేశ్వరి'' అని చెప్పఁబడుచున్నది. జ్ఞానమనునది సంవిత్తు, 'జ్ఞాయతే అ నేన'= 'దీని చేత తెలియఁబడును.' అనుకరణ వ్యుత్పత్తిచేత, వృత్తికూడ – జ్ఞానమగుచున్నది. అయినను, ఇచ్చట భావవ్యుత్పత్తి చేత – 'జ్ఞప్తియే' జ్ఞానమగుచున్నది.

''పూర్ణవము - జ్ఞానవము - సత్యవము'' అనునది బ్రహ్మమునకు స్వరూపలక్షణమగుచున్నది. జ్ఞాన ధర్మియగు బ్రహ్మమునకు జ్ఞానమను ధర్మమేది గలదో, అది యిచట 'మహేశ్వరి' అని చెప్పఁబడినది. ఆ ధర్మమునకు మహిమాదులు - నామాంతరములుగాఁ జెప్పఁబడినవి. మహిమయనఁగా; మహత్త్వధర్మము. తేజమనఁగా; జ్యోతిస్సు, జ్ఞానము చేత - ప్రకాశకత్వము, మహిమ చేత - వ్యాపకత్వము, తేజస్సు చేత - పాచకత్వము, శక్తి చేత - విశ్వధారణ సామర్థ్యము, ప్రాణము చేత - జీవిత రూపత్వము, సిద్ధించును. కావున, ప్రకాశకత్వ- విభుత్వ - పాచకత్వ - విశ్వధారణ సామర్థ్య - జీవితత్వ లక్షణలక్షితయగు మహేశ్వరి - ప్రజ్ఞాతయగు బ్రహ్మము యొక్క జ్ఞానమగుట సిద్ధించుచున్నది. ఈ యర్థమున, ఆచార్యప్రోక్తములగు రెండు శ్లోకములున్నవి.

శ్లో॥ జ్ఞానం ప్రకాశకత్వేన, మహిమావ్యాపకత్వతః
సన్తతాత్ పచనాత్ తేజః శక్తిర్విశ్వస్యధారణాత్
ప్రాణోజీవితరూపత్వాత్। సేయమీశాన సాయినీ
మూలం సర్వ వికారాణాం - ప్రకృతిః పరికీర్త్యతే॥

(ప్రజ్ఞానము - బ్రహ్మమునియు, అతని జ్ఞానము - మహేశ్వరియనియు, చెప్పఁబడినది.)

అవ:- జ్ఞాతృ - జ్ఞానములకుఁ గల అద్వైత (అభేద) సంబంధమును దృష్టాంతము చేత నుపపాదించుచున్నాఁడు.

మూ॥ ప్రచక్షతే చిదాత్మత్వం జ్ఞాతుర్జ్ఞానస్య చోభయోః।
ప్రదీపస్యప్రభాయాశ్చజ్యోతిరాకృతితాం యథా. 3

'ప్రదీపము, ప్రభ,' అను నీ రెండును గూడ - జ్యోతిస్స్వరూప మేయగు నట్లు 'జ్ఞాత - జ్ఞానము' అను నీ రెండును గూడ - చిదాత్మయే - (ఒక్కటియగు చిత్ స్వరూపమే) అని చెప్పుదురు.

ప్రభ:-ధర్మియగు ప్రదీపమునకును, ధర్మమగు ప్రభకును, గూడ ఏకమగు జ్యోతిరాకృతిత్వమును జెప్పునట్లు, ధర్మియగు జ్ఞాతకును ధర్మమగు జ్ఞానమునకును గూడ - అద్వైతమగు సంవిద్రూపత్వమునే చెప్పుదురని భావము. దీపము - దాని వెలుతురు, ఒకటియగు జ్యోతియొక్క రూపమే కాని, రెండుగానట్లు, తెలిసికొనువాఁడును, వాని తెలివియును గూడ ఒక్కటియే యగు జ్ఞానరూపమే, కాని రెండు కావు. ద్వైతమన, భేదము. అద్వైతమన, అభేదము.

అవ:- ప్రదీప - ప్రభలకు వలెను, అగ్ని - ఉష్ణతలకువలెను, జ్ఞాతృ జ్ఞానములకు సంబంధముండిన యెడల, వానికి గుణ - గుణి సంబంధము, విశేష్య-విశేషక భావము, చెప్పవలయుననినయెడల, అట్లుగాదనుచున్నాడు.

మూ॥ చిత ఏకపదార్థత్వాత్, చిచ్చితానవిశిష్యతే!
తస్మాద్ గుణత్వం జ్ఞానస్య శఙ్కరేణ నిరాకృతమ్॥ 4

చిత్తు - ఏకపదార్థము. కావున, ఆచిత్తు - చిత్తుచేతనే విశేషింప (భేదింపఁ) జేయఁబడదు. కావుననే, శంకరభగవత్పాదుల చేత - 'జ్ఞానము - గుణముకా' దని నిరాకరింపఁబడినది.

ప్రభ:- చిత్పదనిష్ఠమగు జ్ఞాన విషయము - ఏక స్వరూపము కావున, చిత్తు తన చేతనే- తాను విశేషింపఁజేయఁబడునది కానేరదు. విశిష్టజ్ఞానము - సంబంధాంతర సాపేక్షము. కావున, తనకు తనతోడి విశిష్టత్వము సంగతము కాదు. జ్ఞానము - జ్ఞాతయొక్క స్వరూపమేయగుచున్నది. కావుననే, అద్వైతాచార్యుడగు శంకరుఁడు - తన భాష్య గ్రంథములయందును, ప్రకరణ గ్రంథముల యందును, గూడ - ఉపపత్తి పూర్వకముగా, ''జ్ఞాన స్వరూపమగు బ్రహ్మమునకు - జ్ఞానము, విశేషణము కాదు'' అని నిరసించియున్నాఁడు.

అవ:- ప్రదీప - ప్రభలవలె, జ్ఞాతృ - జ్ఞానములు - ఏకస్వరూపమే యగును. అట్లవి - యేకస్వరూపమని యంగీకరింపని యెడల; కలుగుదోషమును దెలుపుచున్నాఁడు.

మూ॥ జ్ఞాతుర్జ్ఞానం స్వరూపం స్యాన్నగుణో నాపిచ క్రియా।
యదిస్వస్య స్వరూపేణ వైశిష్ట్యమనవస్థితిః॥ 5

జ్ఞాతకు జ్ఞానము - (చైతన్యము) స్వరూపమే యగును. జ్ఞాతృగతమగు నా జ్ఞానము - గుణముగాని, (జ్ఞాతృకర్తృకయగు) క్రియగాని, కానేరదు, స్వరూపమగు జ్ఞాతకు - స్వరూపమేయగు జ్ఞానము - విశేషణమగు నెడల; అనవస్థాదోష మేర్పడును.

ప్రభ:- విషయి చైతన్యాభివ్యంజకుఁడగు జ్ఞాతకు - చైతన్యమగు జ్ఞానము స్వరూపమేయగును. కాని, గుణము కానేరదు. ''అయ్యా! జ్ఞానము - జ్ఞాతృ గుణము కాకుండినను, జ్ఞాతృక్రియ - కాగూడదా'' అనియాశంకించి, 'అది క్రియగూడ కాదు' అని నిషేధింపఁబడినది. జ్ఞాతయగు స్వరూపమునకు స్వరూపమగు జ్ఞానము చేత వైశిష్ట్యము (విశేషణ ప్రయుక్తత్వము) కలిగిన యెడల స్వరూపమగు నాజ్ఞానమునకు మరల, తత్ స్వరూపమగు జ్ఞానము చేతను, దానికి మరల తత్ స్వరూపము చేతను అనవధిక కార్యకారణ ప్రవాహాపత్తి (కార్యము, కారణము, కార్యము - కారణము అను ప్రవాహమునకు తెంపులేమి) కలుగవలసివచ్చును. ఇది అనవస్థాదోషమగును. (ముగింపు కలుగకుండుట అనుదోషము). కావున ''జ్ఞాతకు స్వరూపమగు జ్ఞానము చేత నగు వైశిష్ట్యము నంగీకరింపఁదగదు'' అని తెలియునది. ''తెలియువాఁడు - తెలివియు నొకటే కాని వేరు కాదు.'' అని 'తెలియఁదగును' అన భావము.

అవ:- ''అయ్యా! జ్ఞాత, జ్ఞానము, కూడ - ఒకే పదార్థమగు నెడల, జ్ఞానము - జ్ఞాతయందుండుననియు, జ్ఞాత - జ్ఞానవంతుడనియు, నిట్లు

ద్వివిధమగు వ్యవహార మెట్లుకలిగినది'' అనియాశంకించి, ప్రత్యుత్తరము నిచ్చుచున్నాఁడు.

మూ॥ వా చైవశక్యతే కర్తుం విభాగ, స్వస్వరూపయోః।
నానుభూత్యా, తతో ద్వైతంసచ్ఛక్త్యోర్వ్యావహారికమ్॥ 6

తనకును, స్వరూపమునకును, (రెండింటికిని) గూడ - విభాగము - వాక్కు చేతమాత్రమే - (మనస్సు చేతమాత్రమే) కావించుటకు శక్యమగును. కాని, అనుభవము చేత విభాగము నొనర్చుటకు శక్యము కాదు. కావున, సత్తునకును, శక్తికిని, గల ద్వైతము (పృథగ్భావము = భేదము) వ్యహార సిద్ధమే గాని, వాస్తవము కాదు. (వస్తుగతము కాదు)

ప్రభ:- ద్రవ్యము నాశ్రయించిన గుణ - క్రియలు - భిన్న పదార్థములుగా నంగీకరింపబడవు. శారీరక (బ్రహ్మసూత్ర) భాష్యమున, (ద్వితీయాధ్యాయము నందలి ద్వితీయ పాదమున 'అపరిగ్రహాచ్చాత్యన్తమనపేక్షా' (అ2 పా 2 అధి 3 సూ 17 బ్రహ్మసూత్ర భాష్యమునఁ జూచునది) అను సూత్రమును వ్యాఖ్యానించునపుడు భగవత్పాదశంకరుల చేత మిక్కిలి నిపుణముగా నీయంశము- నిరూపింపఁబడినది.

ప్రత్యేక వివృతి:- శ్రీ శంకరులు - ఈ సూత్రమును వ్యాఖ్యానించుచు, ''పరమాణువు జగత్కారణమను వాదము - (అయుక్తమగుట వలననే కాక) శిష్టులెవ్వరి చేతనుగూడ, ఏయంశము చేతనుగూడ - పరిగ్రహింపఁబడకుండుట వలన గూడ - ఈవాదము - వేదవాదుల చేత మిగుల, అనాదరింపఁబడఁదగినది.'' అని సూత్రార్థమును జెప్పిరి. తరువాత, ''గుణాదులు - ద్రవ్యాధీనములు'' అనుపక్షమున, ద్రవ్యముండినప్పుడే - అవి యుండుట వలనను, ద్రవ్యము లేనపుడు లేకుండుట వలనను, ద్రవ్యమొక్కటియే - ఆకారభేదము వలన, ''దేవదత్తుఁడొక్కడే యగుచు, అవస్థాభేద సంబంధము వలన, అనేక శబ్ద

ప్రత్యయములను బొందునట్లు, అనేక శబ్ద ప్రత్యయములను బొందునదియగును. అట్లయనయెడల, సాంఖ్య సిద్ధాంత ప్రసంగమును, స్వసిద్ధాంత విరోధమును, కలుగవలసివచ్చునే'' అని యారంభించి, ''అగ్ని ధూమములు వేరని నిశ్చయింపఁ బడుచున్నది'' ఇచ్చటను (ద్రవ్యగుణ విషయమున) 'తెల్లని కంబళము,' 'నల్లనికలువ' అని, ఆయా ద్రవ్యమే - ఆయా విశేషముతో (తాదాత్మ్యమున) ప్రకాశింపఁజేయఁబడుట వలన - ద్రవ్యగుణములకు, అగ్ని ధూమములకు వలె భేద ప్రతీతిలేదు. కావున, గుణము - ద్రవ్యాత్మకమే - (అనఁగా; ద్రవ్యరూపమే కానివేఱు కాదు. అని యర్థము.) ఇట్లనుట చేత (గుణము - ద్రవ్యరూపమే యనుట చేత) ''కర్మ సామాన్య, విశేష సమవాయములు కూడ - ద్రవ్యాత్మ కములు'' అని వ్యాఖ్యానింపఁబడినది... ఇత్యాధికము చేత ''ద్రవ్యముకంటె - గుణాదులు-భిన్నములు కావు'' అని నిరూపించిరి.

ప్రశ్న:- ''అయ్యా! బ్రహ్మము - గుణ విశిష్టము'' అనునంశము - శ్రుతి స్మృతి పురాణముల యందుఁ గొన్ని చోట్లఁ జెప్పఁబడినదే! దానికేముందురు?

ఉత్త :- ''గుణములు - ధర్మమునందుపచరితములు. అగుణములు - (బ్రహ్మభిన్న) ధర్మపరములుగా గ్రహింపఁదగిని.'' అనునది యాచార్యాశయము, ఈ యంశము నీగణపతి మునీంద్రుఁడిట్లు పలికెను. ''ప్రజ్ఞాస్య - గుణత్వంయత్, ప్రజ్ఞాతుః ద్రవ్యతాచయత్। ధర్మత్వాదపిదర్మిత్వాత్, తద్ద్వయం చౌపచారికమ్'' అని. ఈ యంశమును - నీవేదికయందుఁ జూచునది.

మూ॥ బ్రహ్మజ్ఞానస్య పూర్ణస్య విషయోద్యౌ రుదీర్యతే।
సా బ్రహ్మణో వ్యాపకత్వాద్వస్తుతో నాతిరిచ్యతే. 7

పూర్ణమగు (అభిన్నమగు) బ్రహ్మజ్ఞానమునకు (సత్తును, జ్ఞాతయు, నగు బ్రహ్మము యొక్క జ్ఞానమునకు) విషయము - అంతరిక్షమని చెప్పఁబడుచున్నది. బ్రహ్మమునకుఁగల వ్యాపకత్వము వలన ఆయాకాశము గూడ - పరమార్థమున సత్తగు బ్రహ్మముకంటె - వ్యతిరిక్తము (భిన్నము) కాదు.

ప్రభ:- ద్వితీయ కారికయందు 'మహిమా' అనియు, దాని వ్యాఖ్యయందు 'మహిమా వ్యాపకత్వతః'' అనియు, బ్రహ్మము యొక్క వ్యాపకత్వము తెలుపఁ బడినది. బ్రహ్మము యొక్క బృహత్త్వమే - మహత్త్వమగుచున్నది. ఆ మహత్త్వము- వ్యాపకత్వము చేత - ఆకాశరూపముగా గ్రహింపఁబడుచున్నది. కావున, వ్యాపకమగు (వ్యాపించిన) బ్రహ్మమే - ఆకాశము. స్వీయమగు వ్యాపకత్వము = బ్రహ్మజ్ఞానమునకు విషయమగునని యర్థము. కావున, ' ఆకాశము- వస్తుతః బ్రహ్మముకంటె భిన్నము కా''దని భావము. ఆకాశమున కుత్పత్తినాశములు వినఁబడుచున్నవి. కావున నాయాకాశము - అనాదియు, అనంతమును, నిత్యమును, అగు బ్రహ్మమెట్లగును? అని ప్రశ్నించుకొని - సమాధానము నిచ్చుచున్నాఁడు.

మూ॥ వికాసాదపి సఙ్కోచాత్, సర్గప్రలయయోర్ద్వయోః।
ప్రజ్ఞానస్య బుద్ధైరుక్తౌ జన్మనాశావుభౌ దివః 8

(జగత్) సృష్టి యొక్క వికాసము వలన ఆకాశరూపియగు ప్రజ్ఞానమునకు- (ఆకాశరూపియగు బ్రహ్మమునకు) ఉత్పత్తియు, (జన్మమును) ప్రళయరూపమగు, తత్సృష్టి సంకోచము వలన - ఆయాకాశరూపియగు, బ్రహ్మమునకు - నాశమును, పండితులు - చెప్పియున్నారు.

ప్రభ:- వికాసము వలన సృష్టియు సంకోచము వలన ప్రలయమును, అగుచున్నవి. జగత్తునకు సృష్టిప్రలయములుండుట వలన, తన్మూలమగు ఆకాశమునకుఁ కూడ - ఉత్పత్తిలయములు, శ్రుతి చేత వినఁబడుచున్నవి. కాని, (వస్తుతః) యథార్థమునందు, ఆయాకాశము - బ్రహ్మవైభవమే, యగుచున్నది. కావున, అది జనించుట లేదు. ''తైత్తిరీయ శ్రుతియందుఁ జెప్పఁబడిన, ఆకాశోత్పత్తి- జగత్ సృష్టి నపేక్షించినది. కనుక నది వాస్తవము - కాదు'' అని భావము.

అవ:- బ్రహ్మముకంటె భిన్నము కాకుండుట వలన, ఆకాశమున కుత్పత్తి లేదనుచున్నాఁడు.

మూ॥ ధర్మభూతం పరస్యేదం నకార్యం పరమం నభః।
అఖణ్డత్వాన్నవికృతి ర్విశ్వస్మిన్ ప్రకృతిత్వతః 9

పరబ్రహ్మమునకు ధర్మభూతమగు (ధర్మస్వరూపమగు) పరమ వ్యోమమను నీయంతరిక్షము – కార్యముకాదు. (బ్రహ్మము యొక్క కార్యము కాదు) (పూర్ణమగు బ్రహ్మమును, తన్మహత్త్వమును, గూడ అఖండమైయున్నది) అఖండత్వము వలనను, విశ్వము వికారము నొందుచుండగా, అవశేషించి (మిగిలి) విభువై (వ్యాపకమై) ప్రకృతియగుట వలనను, ఈపరమ వ్యోమము – వికృతి కానేరదు.

ప్రభ:- పరమ వ్యోమమునకు బ్రహ్మత్వమును, విశ్వకారణత్వమును, గలుగుట విలన – అదియుత్పన్నము కాదు. బ్రహ్మము యొక్క మహత్త్వము – ఖండము కాదు. కావున నాకాశము – వికృతి కాదు. అది వికృతియగునెడల; కార్యము కావలసివచ్చును. ఆకాశము కార్యము గాకపోవుటయే గాక, ప్రపంచ మునకు ప్రకృతియు నగుచున్నది. ప్రకృతియన; ఉపాదానకారణము. ఇట్లు-ధర్మియగు పరబ్రహ్మమునకు – ఆకాశము – ధర్మమే యగుచున్నది. ధర్మము – భావము (ఉనికి) కంటె, ఇతరము కాదు. ''యస్మింస్తత్త్వం నవిహన్యతే, సభావోధర్మః'' ''దేనియందు, తత్త్వము – కొట్టఁబడునది కాదో, ఆ భావము – ధర్మము'' అని. మహాభాష్యకారుడు చెప్పుచున్నాఁడు. ''ఆకాశశరీరం బ్రహ్మ'' 'బ్రహ్మము – ఆకాశశరీరము గలది.' అని శ్రుతి చెప్పుచున్నది. ప్రజ్ఞాతయు, సత్తును, అగు పరమాత్మ యొక్క ప్రజ్ఞానమునకు విషయత్వము చేత – వ్యాపకమగు ఆకాశము – స్వశరీరమని చెప్పఁబడినది. దీని చేత ధర్మియగు పరమాత్మ యొక్క వైభవము – ప్రతిపాదింపఁబడినది.

అవ:- ఇప్పుడు – ధర్మము యొక్క వైభవమును దెలుపుచున్నాఁడు.

మూ॥ ఆకాశేపరమేదీప్యత్ ప్రజ్ఞానం పరమాత్మనః
ఏకాగ్రత్వాత్ ప్రవృద్ధోష్మగభీరమభవన్మహః॥ 10

స్వశరీరభూతమును, విషయమును, అగు ఆకాశమునందు పరమాత్మ నుండి జ్వలించుచు, 'ఉన్నాను' అని నిత్యమును స్ఫురించుచున్న అహం పదార్థమగు ఆత్మ యొక్క ప్రజ్ఞానము – ఏకాగ్రత్వము వలన మిక్కిలి వృద్ధినొందిన వేడి చేత – (తపస్సు చేత) గంభీరమగు తేజమయ్యెను.

ప్రభ:- ప్రజ్ఞానము – వ్యాపించి యేకాగ్రతతో నుండుట వలన కలిగిన తపో విజృంభణము చేత దానికి పాచకత్వలక్షణమగు, తేజస్త్వము – కలిగెనని భావము.

అవ:- ఇంతవఱకును జెప్పబడిన యర్థమును సంగ్రహించి, ప్రజ్ఞానము యొక్క త్రివిధమగు స్థితిని స్పష్టీకరించుచున్నాడు.

మూ॥ త్రిధైవం ధర్మభూతస్య జ్ఞానస్య వికృతిం వినా
శుద్ధత్వవిషయత్వాభ్యాం మహస్త్వాచ్చదశాత్రయమ్॥ 11

ధర్మభూతమగు ప్రజ్ఞానము – వికృతిని విడుచునపుడు, ప్రకృతి భూతమగుచుండును. ప్రకృతి భూతమగునది – శుద్ధమగుచుండును. విషయమగునపుడు – వ్యాపకమగుచుండును. వికృతి నిమిత్తమగు తపో వైభవమగు తేజస్సు – పాచకమగుచుండును. కావున ప్రజ్ఞానమునకు పూర్వోక్తప్రకారమున మూడుఁదశలున్నవి.

ప్రభ:- ధర్మమగు ప్రజ్ఞానమునకు ప్రజ్ఞాతయందు స్వరూపముతో నుండుట – శుద్ధత్వదశయు, విషయమగు నాకాశమున వ్యాపించుట –

విషయత్వదశయు, తపో వైభవము చేతఁ గలిగిన పాచకత్వము - తేజస్త్వదశ (మహస్త్వదశ)యు, నగునని చెప్పబడినది. ఇట్లు దశాత్రయవంతమగు ప్రజ్ఞానము-సత్తును, ప్రజ్ఞాతయు, నగు బ్రహ్మము యొక్క ధర్మమగుచున్నది. అప్రజ్ఞానమే-'మహేశ్వరి' అనియు 'పరాశక్తి' అనియు చెప్పఁబడుచున్నదని తెలియునది. ప్రథమస్తబకమునందును, దాని వ్యాఖ్యయందును, సకలజగత్ కారణమును గూర్చిన ప్రసంగమునందు ఆకాశముపాదాన కారణమనియు, తపస్సు - నిమిత్తకారణమనియు, నీ కారణములు రెండును గూడ - సర్వశక్తుఁడగు పరమాత్మ యొక్కనియందే కలవనియు, జెప్పఁబడిన యంశము నిచట గ్రహించునది. ప్రజ్ఞానమునకు దశాత్రయమున్నదనుచోటఁ గల 'దశాశబ్దము' - వర్తి (దీపపువత్తి) పర్యాయమగుట వలన, ఆ దశా పదార్థ సామర్థ్యము వలన - ఒకే దీపమునకు మూడువర్తులు (వత్తులు) న్నట్లు - ఒకే ప్రజ్ఞానమునకు ఒకే కాలమున - అవస్థాత్రయముండునను నంశము - స్ఫురింపఁజేయఁబడుచున్నది. కావున ''ప్రజ్ఞానము - త్రిముఖమై, శుద్ధమగు స్వస్థితిని (ప్రకృతిని) విడువకయే, ఆకాశమున వ్యాపించి, తపస్సు చేత, విశ్వమును పరిపక్వమొనర్చుచుండును'' అను ఫలితార్థ మేర్పడుచున్నది. '' ఆనన్దో బ్రహ్మ'' '' ఆకాశశరీరం బ్రహ్మ'' ''యదేష ఆకాశ ఆనన్దోనస్యాత్'' ఇత్యాది శ్రుతులు - ఆకాశరూపమగు బ్రహ్మమునకు - విశ్వోపాదాన కారణత్వమును దెలుపుచున్నవి. ''తదైక్షత, స తపోఽతప్యత, సోఽకామయత'' ఇత్యాది శ్రుతి వాక్యములు - తపించుచున్న ద్రష్టయగు బ్రహ్మమునకు - జగన్నిమిత్తకారణత్వము నుద్ఘోషించుచున్నవి. ''సోఽహమస్మీతి వ్యాహరత్'' 'తతోఽహంనామాభవత్' 'నిమిత్తకారణమగు బ్రహ్మము - నేనున్నాను' అని వ్యవహరించెను. కావున 'నేను' అనునామము (బ్రహ్మమునకు) కలిగెను.' ఇత్యాదిశృతులు మాత్రము - బ్రహ్మము - జగద్రూపకార్యము గాను, తత్కారణముగాను, కనఁబడుచున్నను, కార్యకారణ వివర్జితమును, సత్యమును, అగు నా బ్రహ్మము - నిత్య శుద్ధమేయగుచున్నది. అని బోధించుచున్నవి. అయినను, పూర్వోక్తమగు అవస్థాత్రయముపపన్నమే యగుచున్నది.

అవ:- తపః ప్రభావము వలన నాకాశము నుండి విశ్వము - వికసించి, హనియందు, అస్మదాదుల శరీరములు జన్మించుచున్నను, ఈ జగత్తు - స్వతంత్రము వలెను. స్వతస్సిద్ధము వలెను, స్థూలబుద్ధులకు గోచరించుచున్నది. కావున నాయంశమును - క్రింది శ్లోకముచేత విచారించుచున్నాఁడు.

మూ॥ విజ్ఞానేభాతియేభాన్తి భావా ద్రవ్యగుణాదయః।
నకిఞ్చిదనుభూయన్తే విజ్ఞానోపరమేతుతే.॥ 12

విజ్ఞానము (వృత్తి విశిష్టజ్ఞానము) భాసించుచుండఁగా, ద్రవ్యగుణకర్మ సామాన్య విశేష సమవాయరూపములగు నేభావములు - బుద్ధి గోచరము లగుచుండునో, ఆ భావములు విజ్ఞానముపరమించినపుడు, (విజ్ఞాన భావము లేని నిద్రాదులయందు) కొంచెమయినను గూడ - అనుభవింపఁబడుట లేదు.

ప్రభ:- విజ్ఞానము (బుద్ధి) ప్రకాశించునపుడే, ద్రవ్యాదులు భాసించును. కావున, అవి - విజ్ఞానాధీనములు అని భావము.

అవ:- ఇచట - విజ్ఞానమనఁగా, విషయియందున్న వృత్తి విశిష్టజ్ఞానమని యర్థము నెఱుంగునది. దాని చేత విషయియగు జ్ఞానము ప్రకాశకమును, (ప్రకాశింపఁజేయునదియు) విషయమగు జ్ఞేయము - ప్రకాశ్యమును, (ప్రకాశింపఁజేయఁబడునదియు) అని చెప్పఁబడినట్లయినది. కావున ''విషయము - స్వతఃప్రకాశము - (స్వయముగా ప్రకాశించునది) కాదు'' అని చెప్పుచున్నాడు.

మూ॥ ఏవంస్వతః ప్రకాశత్వం విషయాణాం నదృశ్యతే
సిద్ధిశ్చపరతోనస్యాత్, సమ్బన్ధం కఞ్చిదన్తరా॥ 13

కాగా, విషయములు - స్వయముగాఁ బ్రకాశించునవి, కానేరవు. తమకంటె భిన్నుఁడగు నింకొకనితో సంబంధము లేనియెడల, ఆయితరుని వలనఁ గూడ - ఈ విషయములకు విషయత్వసిద్ధి కలుగనేరదు.

ప్రభ:- ''జ్ఞాతతోడి (తెలిసికొనువానితోడి) సంబంధము వదలినచో విషయములు - జ్ఞేయములు (తెలియఁదగినవి) కానేరవు. అవి - తెలియఁబడ కుండుటయే కాక, విషయియగు నితరము తోడి సంబంధము వినా, అవి - విషయములే కాఁజాలవు'' అని యర్థము. కావున ఫలితమగు భావము నిట్లెఱుఁగునది. ''విషయములకు స్వతః ప్రకాశము లేదు. విజ్ఞానము భాసించునప్పుడే, అవి ప్రకాశించును. కావున, నవి విజ్ఞాన భాసాధీనములు, ఇంతేకాక, వానికి - (విషయములకు) స్వతః, విషయత్వము గూడ సిద్ధించునది కానేరదు. విషయియగు జ్ఞాతతోడి సంబంధము వలన మాత్రమే వానికి విషయత్వము కూడ సిద్ధించును.'' (''ద్రవ్యాదులు - స్వతః జ్ఞేయములును, విషయములును, గూడ - కాఁజాలవు. జ్ఞాతృవిషయి సంబంధము వలన మాత్రమే యవి జ్ఞేయములును, విషయములును గూడ నగును.'' అని భావము)

అవ:-''అయ్యా! విషయములు - స్వతః, ప్రకాశింపకున్నను, స్వతః సిద్ధింపకున్నను, లోపము లేదు. విషయియగు జ్ఞాతకంటె భిన్నములగు భావములు- లేకపోలేదు గదా.'' అని ప్రశ్నించుకొని, చెప్పుచున్నాఁడు.

మూ॥ దృశ్యతేవిషయాకారా గ్రహణే స్మరణేచధీః।
ప్రజ్ఞావిషయతాదాత్మ్య మేవం సాక్షాత్ ప్రదృశ్యతే ॥ 14

పదార్థములను గ్రహించుట యందును, (తెలిసికొనుట యందును) స్మరించుటయందును, వృత్తి రూపమగు బుద్ధి- (వృత్త్యాత్మకమగు జ్ఞానము) విషయాకారమై, (విషయరూపమున నున్నదై) కాన్పించుచున్నది. కావున, ప్రజ్ఞా- విషయములకు; గల (బుద్ధి వృత్తికిని, విషయములకును గల) తాదాత్మ్యము - ('తదాకారతా సంబంధము' - అనఁగా బుద్ధి వృత్తియు, విషయములును గూడ,- ఒకే యాకారమును గలిగియుండుట) సర్వప్రాణులకును గూడ - సాక్షాత్తుగా ననుభవసిద్ధమగుచున్నది.

ప్రభ:- 'ప్రజ్ఞ' యను పేరుగల 'బుద్ధి వృత్తి' - విషయముకంటె వేరయినను, విషయముకంటె - వేరుగాక యుండుట వలన, తంతు - పటములకు వలె. ఆ వృత్తి - విషయములకు - తాదాత్మ్య సంబంధము నెఱుఁగవలయును. 'సాలెవాని యిచ్ఛా సామర్థ్యము వలన - తంతువులు - పటరూపములగు నట్లు, తపో వైభవము వలన, ఏకమును, సత్తును, ఆకాశరూపమును, అగు బ్రహ్మమునకు - నానాభావత్వము చేత - విషయాకారత - కాన్పించుచున్నది. కావున, ఇట్లే, బుద్ధి వృత్తి వైభవము వలన - సత్తయిన భావమునకు, విషయాకారత కాన్పించును'' అని భావము.

అవ:- ఈ యంశమునే - ఉత్తరకారికచేఁ దెలుపుచున్నాఁడు.

మూ॥ నచేత్ సమష్టి విజ్ఞాన విభూతిరఖిలం జగత్।
విషయవ్యష్టి విజ్ఞాన తాదాత్మ్యం నోపపద్యతే. 15

విషయాకారమున నున్న యీ జగత్తంతయు - సమష్టి విజ్ఞానము యొక్క విభూతియే యగుచున్నది. ఈ లోకము - సముదాయభావము నొందినదియు, పూర్ణమయినదియు, సత్యమును, తపోమహిమ చేత వ్యాపించియున్నదియు, నగు విశిష్ట జ్ఞానము యొక్క విభూతి కాని యెడల గ్రహణ, స్మరణ, (ధ్యాన) గోచరమగు విషయమునకును, (పదార్థమునకును)- దాని కంటె వేరుగా భాసించుచున్న వ్యష్టి విజ్ఞానమునకును, గల తాదాత్మ్యము - ('భేదమున్నను, భేదము లేకుండుట' అను భేదా భేద సంబంధము) కుదురనేరదు.

ప్రభ:- మనయొక్క ప్రజ్ఞలకును, విషయములకును, తాదాత్మ్యరూపమగు సంబంధము - పూర్వము చెప్పఁబడినది. ఈ శ్లోకమున - ''సమష్టి విజ్ఞానమునకును, జగత్తునకును, గల తాదాత్మ్యమువలననే - సమష్టిలోపల - వేరుగా భాసించుచున్న వ్యష్టివిజ్ఞానమునకును, దాని విషయమునకును, గూడ -

తాదాత్మ్యము సంభవించును'' అని పూర్వోక్తమగు దానికి హేతువు చెప్పఁబడినది. ఈ రెంటికిని, తాదాత్మ్య సంబంధము ప్రతిపాదింపఁబడునపుడు – భేదాభేద సంబంధము – సిద్ధించును. అట్టి తాదాత్మ్యము ప్రతిపాదింపఁబడని యెడల, సంబంధమే – లేక పోవలసివచ్చును.

అవ:- ''వికృతి చేత – భేదమును, ప్రకృతి చేత – అభేదమును, కలుగును'' అని, యాభేదాభేద సంబంధమును దెలుపుచున్నాఁడు.

మూ॥ యథాఽస్మదాది విజ్ఞానే ధ్యేయం బుద్ధిరితిద్వయమ్।
పూర్ణేసమష్టి విజ్ఞానే, వికృతిః ప్రకృతి స్తథా ॥ 16

అస్మదాదుల ధీవృత్తిరూపమగు వ్యష్టి విజ్ఞానమున – ధ్యేయము, (ధ్యానించి తెలియదగిన విషయమగు వస్తువు) బుద్ధి, (జ్ఞానము) అను రెండును గలుగునట్లు, పూర్ణమగు సమష్టి విజ్ఞానమున – 1. వికృతియు, (విషయాకారమును, జ్ఞేయమును, అగు విశ్వమును) 2. ప్రకృతియు, (మూలజ్ఞానమును) అను రెండున్నవి.

ప్రభ:- వ్యష్టి విజ్ఞాన – విషయముల వలె, సమష్టి విజ్ఞాన – విషయములు- రెండును, గలవని భావము.

అవ:- జ్ఞానమే – జ్ఞేయాకారమున, పరిణామము నొందుననుచున్నాఁడు.

మూ॥ పరిణామోయథాస్వప్నః సూక్ష్మ స్యస్థూలరూపతః।
జాగ్రత్ ప్రపఞ్చ ఏషస్యాత్త థేశ్వర మహాచితః॥ 17

సూక్ష్మమగు జ్ఞానము – స్థూల రూపమున పరిణమించి, (వికారము నొంది) స్వప్నమగునట్లు, (సూక్ష్మతమమును, కారణ భూతమును, అగు) ఈశ్వరమహాచిత్తు (ప్రజ్ఞారూపమగు సమష్టి విజ్ఞానము) – పరిణామము నొందియే, జాగ్రత్ ప్రపంచమగుచున్నది.

ప్రభ:- ''అస్మదాదుల ధీపరిణామము – స్వప్నమగునట్లు, జాగ్రదవస్థ యందు స్థూలరూపమున మనకుఁ గనఁబడుచున్న విశ్వ విస్తారము – మిక్కిలి సూక్ష్మమగు సమష్టి విజ్ఞానము యొక్క పరిణామ విశేషమేయగును'' అని యర్థము.

విశే:- కావుననే – ''జీవన్ముక్తుని చిత్తము నశించినను, సమష్టి విజ్ఞానవికార మగు ప్రపంచము నశింపదు'' అను రహస్యము నెఱుఁగునది.

అవ:- ప్రకృతికిని, వికృతికిని, గల భేదమును దెలుపుచున్నాఁడు.

మూ॥ వికృతిస్సర్వభూతాని, ప్రకృతిః పరదేవతా।
సతః పాదస్తయోరాద్యా, త్రిపాదీ గీయతేపరా. 18

పరదేవత– ('సతి' యగుశక్తి–) ప్రకృతియగుచున్నది. పుట్టిన లోకములును, ప్రాణులును, వికృతియగుచున్నది. ఆ రెండింటిలోను, మొదటిదగు వికృతి – సత్తగు బ్రహ్మము యొక్క – పాదమగుచున్నది. (అల్పాంశమైయున్నది). తదితరయగు ప్రకృతి – (పరదేవత) త్రిపాదియగు చున్నది. ('అధికాంశ' యగుచున్నది).

ప్రభ:- భూతములన్నియు – 'వికృతి' అని చెప్పఁబడును. వికృతియనఁగా ప్రకృతి పరిణామమని యర్థము. 'మహేశ్వరి' అని, చెప్పఁబడుచున్న, పరదేవత – బ్రహ్మము యొక్క ధర్మమగు ప్రకృతియగుచున్నది. ప్రజ్ఞానము యొక్క దశాత్రయము – వెనుక చెప్పఁబడినది. ఆయవస్థలయందు, ప్రథమదశయగు వ్యాపకత – 'ఆకాశరూపిణి'' అని చెప్పఁబడుట వలన – పరదేవతకుఁ గల సర్వభూత ప్రకృత్వము – స్పష్టీకరింపఁబడినది. సత్తయిన బ్రహ్మము వలన వ్యాకరింపఁబడిన, భూతములన్నియు – వికృతియని చెప్పఁబడినను, అఖండమును, పూర్ణమును, సత్తును, అగు బ్రహ్మము – అవ్యయమును, అని కార్యమును, అగునను

నంశమును స్ఫురింపఁజేయుటకు– '' ఈ వికృతియంతయుఁగూడ - (బ్రహ్మమునందత్యల్పమగు) అంశమే'' అనియు, అమృతమగు నధికాంశము - స్వస్వరూపమునందే యున్నది'' అనియుఁ దెలుపు శ్రుత్యర్థముకూడ స్మరింపఁబడినది.

''పాదోఽస్య సర్వభూతాని
త్రిపాదస్యామృతం దివి''

అని పురుష సూక్తమంత్రము – ప్రవచించుచున్నది కదా!

అవ:- ''ప్రకృతి యొక్క పాదము వలన – ప్రపంచరూపమగు వికృతి - ప్రాదుర్భవించిన యెడల, నది – అవి కార్యమును, (వికారము లేనిదియు) వికార హేతువును, గూడనగుచు నొకేకాలము నందుండుట – యెట్లుపపన్నమగును?'' అని యాశంకించి, చెప్పుచున్నాడు.

మూ॥ కబలీకృత్యసఙ్కల్పానేకాఽపిస్యాద్ యథామతిః।
భూతాని కబలీకృత్య, దేవతాపితథా, పరా 19

అస్మదాదుల బుద్ధి – ఒక్కటియేయయినను, తనయందు పరిణమించు చున్న వివిధములగు సంకల్పముల నన్నిఁటిని గూడ – కబళించి, (వశీకరించుకొని) (తానే) యుండునట్లు, పరదేవత కూడ – తననుండి ప్రభవించుచున్న భూతముల నన్నిఁటిని గూడ, కబళించి, (తనకుహాని లేకుండ) నిలుచుచుండును.

ప్రభ:– సంకల్పములు – అనేకములును, భిన్నములును, గూడ - నగుచున్నను, అవియన్నియు – వేర్వేరుగాను, సంపూర్ణముగాను, గూడ - బుద్ధియొక్క పరిణామములేయగుచున్నవి. బుద్ధికిఁగూడ – సంకల్పాత్మకమగు నా పరిణామము చేత – హాని కలుగుట లేదు. అట్లే, పరదేవత నుండి పుట్టిన భూతములు కూడ – అనేకములును, భిన్నములును, అగుచున్నను, అవియన్నియుఁగూడ – వేరుగాను, సంపూర్ణముగాను, గూడ – 'పరదేవతా

పరిణామములే' యగుచున్నవి. (ఆమె యందే – తదాకారములే యగుచున్నవి.) కావున పరదేవత – వికార హేతువైనను, అవికార్యయగుట – సిద్ధించునని భావము.

అవ: - భేద రూపమగు ప్రపంచము యొక్క సృష్టియు, సంహారమును గూడ– ఒక్క చోటనే– (అనగా పరదేవతయందే) కలుగుట వలన ఏకత్వమునకును, అనేకత్వమునకును, విరోధము – కలుగదని చెప్పుచున్నాఁడు.

మూ॥ భూతానామాత్మనస్సర్గేఁ సంహృతౌ, చ తథాత్మని।
ప్రభవేద్దేవతా శ్రేష్ఠా సఙ్కల్పానాం యథామతిః 20

స్వాత్మనుండి సంకల్పము ఉదయించునపుడును, స్వాత్మయందే లయించునపుడును గూడ, మతి – సమర్థమై యుండునట్లు, సత్తును, పూర్ణమును, అగు పరమాత్మనుండి (కలుగు) భూతముల సృష్టి విషయమునందును, పరమాత్మయందే యగు సంహార విషయమునందును, గూడ – పరదేవత – సమర్థయే – అగుచుండును. (స్థిర స్వరూపముననుండును)

ప్రభ:- బుద్ధియొక్క ప్రభావము వలన, స్వాత్మనుండి సంకల్పములుదయించి, స్వాత్మయందు లయించునట్లు, 'పరదేవతా ప్రభావము వలన – పరమాత్మ నుండి సర్వభూతములును జన్మించి, పరమాత్మయందే లయించును' అని భావము. సమష్టి– వ్యష్టి విజ్ఞానముల వికాసమే – సృష్టియనియు, వాని సంకోచమే – ప్రలయమనియు, గ్రహింపఁదగును. ''సంకోచము కలుగునపుడు, ప్రజ్ఞ – శూన్యము వలె నుండును'' అను హేతువువలన 'ఆ' ప్రజ్ఞ– వస్తుతః, పూర్ణయై యున్నను, గూడ – కొందఱు. దానిని శూన్యమని చెప్పుదురు.

''సఙ్కోచే శూన్యవత్ప్రజ్ఞా విశ్రాన్తా స్వాశ్రయేభవేత్।
తస్మాచ్ఛూన్యాఖ్యయా సేయ ముచ్యతే కైశ్చి దీశ్వరీ''

''సంకోచము కలుగునపుడు ప్రజ్ఞ – స్వాశ్రయమగు బ్రహ్మము నందు విశ్రమించినదై, శూన్యము వలెనుండును. కావున, ప్రజ్ఞా రూపిణియగు నాయీ యీశ్వరి ''శూన్యమను'' పేరుగలదని కొందఱు విద్వాంసులు చెప్పుదురు.'' అని యీ యాచార్యునిచే నీయర్థమున, మీఁది శ్లోకము చెప్పఁబడినది.

అవ:- ''అయ్యా! అట్లయిన యెడట, ఈ పరదేవతా స్వరూపమెట్లు తెలియఁబడును.'' అని ప్రశ్నించుకొని, ప్రత్యుత్తరము నిచ్చుచున్నాఁడు.

మూ॥ అనుభూత్యాత్మికాసేయమీశశక్తిః- పరాత్పరా।
ఆధారచక్రే, పిణ్డేషు, విరాజతి విభిన్నవత్. **21**

విశ్వ వికృతి హేతువును, ప్రకృతియు, ఈశ్వర శక్తియు, నగు నాయీ పరాత్పర – అనుభూతి స్వరూపిణియై యున్నది. ఈ మహేశ్వరి – తానొక్కతెయే యయినను, పిండములయందు – (పాంచ భౌతికములగు శరీరముల యందు) భిన్నురాలి వలె, (వేరు చేయఁబడిన దానివలె) దేహధారణమున కాధారభూతమగు మూలాధార చక్రమున విరాజిల్లుచున్నది.

ప్రభ:- అవిభక్తయు, కుండలినీ శబ్ద వాచ్యయు, నగు పరదేవత – సర్వప్రాణి శరీరములందును గూడ – ప్రత్యేకముగా విభజింపఁబడినదానివలె, విభాసించునవి భావము. 'అనుభూత్యాత్మిక' అనఁగా; 'అనుభూతియే – స్వరూపముగాఁగలది'' అని యర్థము. అనుభూతి యనఁగా; సాక్షాత్తుగాఁ దెలియుట. అది – విగళిత వేద్యాంతరమును, ఘనమును, నగుచుండును. వృత్తి విషయగ్రహణ, స్మరణాదుల వలనఁగూడ – ఈయనుభవము – నిష్పన్నముగాని, అభివ్యంజితము గాని, యగుచున్నను; నిష్పన్నమగు ననుభవము మాత్రము – వృత్తి విషయనిరపేక్షమై; భాసించును. కావుననే ' ఆయనుభవము – విగళిత వేద్యాంతర' మని (తెలియఁదగిన యితరము లేనిదని) కీర్తింపఁబడుచున్నది.

అవ:- ఇట్లు – ''విశ్వకారణ భూతయగు పరాశక్తి – మూలాధారమున కుండలినీ రూపమున – అధి పిండమగు స్థితినొందుచుండును. అని చెప్పి, ''కారణభూతయగు నాపరదేవతకు– సూక్ష్మ, స్థూల, భేదమున – పిండమునందగు శాఖాద్వయివలె, శక్తిద్వయము గలదు'' అని నిరూపించుచున్నాఁడు.

మూ॥ సూక్ష్మస్థూలేతతః శాఖేవిద్యుచ్ఛక్తి సమీరవత్।
తత్రాద్యాజ్ఞానశక్తిస్స్యాత్ క్రియాశక్తిరనన్తరా. **22**

ఆధార చక్రమునందుండు పరాశక్తికి – సూక్ష్మమును, స్థూలమును, అగు శాఖలు – రెండున్నవి. అందు, మొదటిది – ఆకాశమునందంతటను వ్యాపించు విద్యుచ్ఛక్తివలెను, రెండవది – జగత్ప్రాణుఁడగు వాయువు వలెను, వెలయుచున్నవి. అందు మొదటిది – సూక్ష్మమగు విద్యుచ్ఛక్తిని బోలిన జ్ఞానశక్తియు, రెండవది – స్థూలమగు వాయువును బోలిన క్రియాశక్తియు, నగుచున్నవి.

ప్రభ:- వాయువు – స్పర్శ గమ్యమగుట వలన – విద్యుచ్ఛక్తి కంటె స్థూలమగుచున్నది. మన శరీరమునందున్న జ్ఞానశక్తియను శాఖ – చిత్తమనియు, క్రియాశక్తియను శాఖ – ప్రాణమనియు, గ్రహించునది. ఈయర్థమును 'శ్రీరమణమహర్షి' ప్రవచించిన ఉపదేశసారమునందలి క్రింది శ్లోకముకూడ – ఇట్లు, తెలుపుచున్నది.

''చిత్త – వాయవశ్చిత్ క్రియాయుతాః।
శాఖ యోర్ద్వయీ శక్తి మూలకా''

''చిత్తుతోఁగూడిన చిత్తములును, క్రియతోఁ గూడిన వాయువులును, (ప్రాణములును) ఈశ్వరశక్తియే – మూలముగాఁగల రెండు శాఖలైయున్నవి. ఆదిశక్తియొక్క జ్ఞాన శక్తి శాఖయే – చిత్తములు. క్రియాశక్తి శాఖయే – ప్రాణములు. ప్రాణులనేకులగుట వలన, బహువచనము – చెప్పఁబడినది. చిత్త, ప్రాణము,

లీశ్వరశక్తి యొక్క శాఖాద్వయమగుట వలన – ఆశక్తి నెఱుఁగుటకు చిత్త ప్రాణములే– మార్గములగును'' (ఉపదేశసారము 12వ శ్లోకమును జూచునది.)

ప్రభ:- శక్తి ద్వయిని – వివరించుచున్నాడు.

మూ॥ జ్ఞానేన్ద్రియాణిప్రథమావిభూతిర్మనసాసహ।
కర్మేన్ద్రియాణిత్వపరావిభూతిస్సహసాసహ. 23

మనస్సుతోఁగూడిన, (మనో– బుద్ధి – చిత్తాహంకారములతోఁ గూడిన) చక్షురాదులగు జ్ఞానేంద్రియములు – ప్రథమయగు విభూతి (సూక్ష్మమగు జ్ఞానశక్తి) యగుచున్నది. బలముతోఁగూడిన వాగాదులగు కర్మేంద్రియములు – ద్వితీయయగు విభూతి (స్థూలమగు క్రియాశక్తి) యగుచున్నది.

ఇట్లు పరదేవతా తత్త్వమునుపదేశించి – తత్ సాక్షాత్కారమునకుఁదగిన యుపాయమును దెలుపుచున్నాఁడు.

మూ॥ క్రియామూల ముత, జ్ఞానమూలంకిమితిచిన్తయన్
ఆత్మశక్తిమితో విద్వానమృతత్వాయ కల్పతే. 24

''క్రియాశక్తి యొక్క మూలమును, జ్ఞానశక్తి యొక్క మూలమును, అగు వస్తువేది? అని ధ్యానించి – ఆత్మ శక్తి నెఱిఁగిన విద్వాంసుఁడు – 'అమృతుఁడు' (మరణ రహితుఁడు) అగుచున్నాఁడు.

ఏకాగ్రధ్యానము చేత – ప్రాణమూలమును, మనో మూలమును అగు ఆత్మశక్తి నొందిన పురుషుఁడు – ముక్తుఁడగునని భావము.

అవ:- స్తబకమును ముగించుచున్నాఁడు.

మూ॥ గభీరాస్సుతరామేతాః కాలికాతత్త్వకారికాః।
ధియోభాసోగణపతేర్భవన్తు విదుషాం ముదే॥ 25

గణపతినగు నాయొక్క శుద్ధ బుద్ధిదీప్తులును, మిక్కిలి యగాధములును, కాలి కాతత్త్వకారికలును, (పరదేవతాస్వరూప ప్రతిపాదకములును) అగు నీ శ్లోకములు – విద్వాంసులకు ప్రీతినొసఁగు గాత!

(ఈ స్తబకము – ఆధ్యాత్మ విద్యారూపము. దీనిని గురుముఖమునఁ దెలియవలయును. అత్యావశ్యకమయినది. కనుక, విడవఁదగదు. పం. ల. నా)

ఇది – సవ్యాఖ్యమగు సప్తత్రింశస్తబకము

****